క్లుప్తంగా

ఏలూరు ట్రాఫిక్ సీఐగా కేవీఎస్ వరప్రసాద్



జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తోన్న ట్రాఫిక్ సీఐ వరప్రసాద్

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా, ప్రజలకు మెరుగైన రీతిలో సేవలు అందించాలని ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి చెప్పారు. ఏలూరు ట్రాఫిక్ సీఐగా కేవీఎస్ వరప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ మేరీ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏలూరు నగరంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలనీ, రహదారి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. మోటారు సైకిల్‌పై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. కళాశాలలు, పాఠశాలల తరగతులు ముగింపు సమయంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు.

సీఆర్ఆర్ మహిళా కళాశాలలో వక్తృత్వ పోటీలు



వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినిలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినిలకు గురువారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఫోరమ్ ఆఫ్ ఫ్రీ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ సహకారంతో నిరుద్యోగిత నిరుద్యోగం కంటే పెద్ద సమస్య–ఇటీవలి కాలంలో భారతదేశం నైపుణ్యం వైపు అడుగులు అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 18 మంది విద్యార్థినుల మధ్య ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని పి.లావణ్య గెలుచుకోగా జి.యోగితా రాజ్యలక్ష్మి ద్వితీయ, కె.సుమ తృతీయ, ఆర్.జాహ్నవి 4వ, కె.సౌభాగ్యలక్ష్మి 5వ బహుమతులు సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందచేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా కళాశాల అధ్యాపకులు కె.శైలజ, కె.హేమలత వ్యవహరించారు.

పేదల ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: పేదలను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం ఏలూరు మండలం జాలిపూడిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం బారినపడిన పేదలు వద్దకే వైద్యం చేర్చాలన్నా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నతమైందన్నారు. దీన్ని గుర్తించి ప్రజలు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖరీదైన టెస్టులు సైతం ప్రభుత్వం ఉచితంగా చేపట్టిన మందులు అందిస్తుందన్నారు.

పేదలకు ఇంటి స్థలాల పట్టాలు

గ్రామంలో 60 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చేతుల మీదుగా ఇంటిస్థలం పట్టాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదనే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనతో ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇంటి స్థలం మంజూరు చేస్తోందన్నారు. లబ్ధిదారులు ఇల్లు కట్టుకునేందుకు రూ 1.80 లక్షల నగదు అందిస్తోందని గుర్తు చేశారు. ఇదే క్రమంలో కోట్ల రూపాయలు వెచ్చించి జగనన్నకాలనీల్లో తాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర మౌలిక వసతులు వెనువెంటనే కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, సర్పంచ్ వీది నవ్య, ఎంపీటీసీ సభ్యుడు కాకర్ల తంబి, రైతు సంఘం చైర్మన్ బొల్లిముంత రాము, వైసీపీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, వైఎస్సార్‌సీపీ గ్రామాధ్యక్షుడు వాసు, కోడిచుక్కల నాగేశు తదితరులు పాల్గొన్నారు.



జాలిపూడిలో జరిగిన వైద్య శిబిరం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



వైద్య శిబిరానికి వచ్చిన వృద్ధురాలి ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొఠారు

జాలిపూడి డ్రెయిన్ గ్యాంగ్ వర్క్ ప్రారంభం



గ్యాంగ్ వర్క్ చేస్తున్న నగరపాలక సంస్థ శానిటరీ కార్మికులు



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన జాలిపూడి డ్రెయిన్

ఏలూరు టౌన్: నగరంలోని జాలిపూడి డ్రెయిన్ కాలుష్య కోరల్లో చిక్కుకుపోయింది. ఏలూరు వన్‌టౌన్, టూటౌన్ ప్రాంతాల గుండా వెళ్లే జాలిపూడి డ్రెయిన్ పూర్తిగా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. వ్యాపారులు, ప్రజలు సైతం డ్రెయిన్‌లో వ్యర్థాలు వేస్తూ పూర్తిగా ప్లాస్టిక్ మయం చేశారు. ఈ నేపథ్యంలో ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ సూచనలతో జాలిపూడి డ్రెయిన్ ప్రక్షాళన చేపట్టినట్లు ఏలూరు డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం జాలిపూడి డ్రెయిన్ గ్యాంగ్ వర్క్ చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికులను పెద్ద ఎత్తున నియమించి గ్యాంగ్ వర్క్ చేయించారు. ఏకంగా ట్రాక్టర్ల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు వచ్చాయని ఆయన తెలిపారు. ప్రజలు, వ్యాపారులు, రోడ్లపై వ్యాపారాలు చేసే వారు వ్యర్థాలను ఇలా డ్రెయిన్లలో వేయకుండా నగరపాలక సంస్థ చెత్త వాహనాలకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పొలిమేర దాసు, పార్టీ నాయకులు అర్జి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియానికి మరమ్మతులు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఇండోర్ స్టేడియానికి మరమ్మతులు చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏలూరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఇండోర్ స్టేడియం భవనం శిథిలావస్థలో ఉండడంతో పైకప్పు కూలిపోయిందన్నారు. అదృష్టవశాత్తు ఆసమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేయాలని కోరారు. ఇటు యువతకు, అటు వాకర్స్‌కు ఎంతో ఉపయోగపడే స్టేడియాలను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయాలని కోరారు.

బధిరుల పాఠశాల పరిశీలన

ఏలూరు రూరల్: బధిరులకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కృష్ణా, గుంటూరు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ టి.కల్పలతరెడ్డి అన్నారు. గురువారం ఆమె శనివారపుపేట పరివర్తన బధిరుల పాఠశాల సందర్శించారు. ఈ సందరర్భంగా బధిరులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాప్రమాణాల గురించి అడిగారు. మొత్తంగా 110 మంది విద్యార్థులకు వసతి కల్పించి, విద్యాబుద్ధులు నేర్పుతున్నామని ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి ఆమెకు వివరించారు. డిసియుబీ సెక్రటరీ ఎ.సర్వేశ్వరరావు మాట్లాడుతూ గతంలో కల్పలత రెడ్డి చైల్డ్ కేర్ లీవ్ ఎక్స్‌టెన్షన్ ఎంఈఓగా పనిచేసి దివ్యాంగులకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ఏపీవైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గెద్దం సుధీర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.కెనడి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ టి.ఎడ్వర్డ్, 98 డీఎస్సీ ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించారు.



ఎమ్మెల్సీ కల్పలతరెడ్డికి శాలువ కప్పి సన్మానించిన ఉపాధ్యాయులు

నూరుశాతం హామీల అమలు ఘనత జగన్‌దే

ఏలూరు (టూటౌన్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు నవరత్నాల పేరుతో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి అయిన తరువాత నూరుశాతం నెరవేర్చారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు అన్నారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ రాష్ట్రంలో 175 సీట్లలోనూ పోటీ చేసి 175 చోట్లా గెలుస్తానంటూ చాలెంజ్ చేస్తుండగా పవన్ మాత్రం ఒంటరిగా పోటీ చేస్తే డిపాజిట్ కూడా రాదని భయపడి చంద్రబాబు దగ్గర ప్యాకేజీ తీసుకుని కలిసి పోటీ చేస్తానంటున్నాడని ఎద్దేవా చేశారు. అమరావతి భూముల్లో చంద్రబాబు, లోకేష్, నారాయణ ఎంత అవినీతికి పాల్పడ్డారో, ప్రజల సొమ్ము ఎంత దోచుకున్నారో తేటతెల్లమైందన్నారు. చంద్రబాబు మీద ఉన్న కేసులు రుజువయ్యే అవకాశం ఉందని అదే జరిగితే చంద్రబాబు జీవితాంతం జైల్లోనే గడపవలసి వస్తుందన్నారు. 2024 ఎన్నికల్లో కచ్చితంగా మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ విజయం సాధిస్తారంటూ ధీమా వ్యక్తం చేశారు. మాలమహానాడు జిల్లా యూత్ అధ్యక్షుడు ఎ.ఆనంద్, నాయకులు ఎం.యేసేబు, సీహెచ్ గోపి, ఎం.యాకోబు పాల్గొన్నారు.



పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న మంగరాజు

ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలి

ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్

దెందులూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, కుటుంబ, సమాభివృద్ధి కోసం శాంతియుతంగా జీవించాలని, అలా కాకుండా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టం తన పని తాను చేస్తుందని ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ అన్నారు. గురువారం రాత్రి అలుగులగూడెం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో బహిరంగ సభ జరిగింది. ఇటీవల అలుగులగూడెంలో దళితులపై జరిగిన దాడి వివరాలను చైర్మన్ విక్టర్ ప్రసాద్ అడిగి తెలుసుకున్నారు. తమపై దాడి చేసి గాయపరిచిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని దళితులు కోరారు. దళితులపై దాడి చేసి గాయపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని నూజివీడు డీఎస్పీని ఆదేశించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఒక్కరి అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పన కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. విద్య, వైద్యరంగాలకు పెద్దపీట వేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇరుగుపొరుగువారితో ప్రేమ, సేవా భావంతో జీవించాలే తప్ప కక్షలు, కార్పణ్యాలు, గొడవల ఉద్దేశ్యంతో ఉండకూడదన్నారు. అటువంటి వారిపై ప్రభుత్వం ఎప్పుడూ నిఘాతోనే ఉంటుందన్నారు. భవిష్యత్తులో రెండు గ్రామాల మధ్య ఏ గ్రామంలోనూ గొడవలు జరగకుండా మంచి వాతావరణంలో అన్నదమ్ముల మాదిరిగా ఉండాలన్నదని, తమతో పాటు ప్రభుత్వ అభిమతమన్నారు. ఈ దిశగా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్, ఎన్టీఆర్ విగ్రహాల వద్ద నూతనంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి పథకానికి ఫెన్సింగ్ సౌకర్యం కల్పించాలని దళితులు చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను కోరారు. ఆయన వెంట జిల్లా, మండల అధికారులు, దళిత పెద్దలు ఉన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎం.విక్టర్ ప్రసాద్

నాడు నేడు పథకం సర్కారీ బడుల పాలిట వరం

భీమడోలు: నాడు నేడు పథకం సర్కారీ బడుల పాలిట వరమని భీమడోలు ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను తదితర గ్రామాల్లో జరుగుతున్న నాడు నేడు పథకం రెండో విడత పనులను గురువారం ఆయన పరిశీలించారు. భీమడోలు ప్లస్ టూ ఉన్నత పాఠశాల(జూనియర్ కళాశాల)కు ప్రభుత్వం 9 అదనపు తరగతుల నిర్మాణానికి రూ.51,94,310 వెచ్చిస్తోంది. నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెలాఖరు నాటికి నాడు నేడు పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉన్నత పాఠశాలలో ఇంటర్ తరగతులు ప్రారంభించిందని, పక్కా భవనాలు అందుబాటులోకి రానున్నాయని ఎంఈవో చెప్పారు. రెండో విడత నాడు నేడు పథకంలో 21 ప్రాథమిక, యూపీ, ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం రూ.2.28 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇప్పటి వరకు రూ.2.25 కోట్ల పనులు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు గారపాటి సునీత, రెడ్డియ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

దెందులూరు: కూలీలు, రైతులు, ఆర్థికాభివృద్ధి జీవన విధానం మెరుగుపరచడానికి, వలసలు నిరోధించడానికి అమలు జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం అమలు తీరును పరిశీలించడానికి వచ్చామని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్ (అమరావతి) బృందం పి.నాగరాజు, ఎస్. లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని పెరుగ్గూడెం, గోపన్నపాలెం గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పంపిణీ చేసిన మొక్కలను పొలాలకు వెళ్లి నేరుగా పరిశీలించారు. రైతులను అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భూగర్భజలాలు పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతలను బృందం సభ్యులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పెరుగ్గూడెం గ్రామ సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, గోపన్నపాలెం సర్పంచ్ కోటీ నాగమల్లేశ్వరి కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
డీ.తిరుమల ఏలురు బీహెచ్‌ఈఎల్	22.15	33
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

మహిళా రిజర్వేషను బిల్లును అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్): మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఏలూరు జిల్లా నుండి ఐద్వా నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి,ఏలూరు నగర నాయకులు సీహెచ్ రాజ్యలక్ష్మి కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు.

ఎంపీ కోటగిరిని కలిసిన కొఠారి మోహన్

దెందులూరు: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను ఎంపీ కార్యాలయంలో లింగపాలెం మండలం నూతన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొఠారి మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. మండల అధ్యక్షుడిగా నియమితులైన విషయాన్ని తెలియచేశారు. ఈ సందర్భంగా ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కొఠారి మోహన్ సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో లిడ్‌క్యాప్ ఏపీ డైరెక్టర్ సొంగా సందీప్, కోటగిరి హరీష్, మధు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

దసరా ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

నిడమర్రు: బువ్వనపల్లిలోని ఎమ్మెల్యే నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రామ దేవత వడలమ్మ అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించే దసరా నవరాత్రుల కరపత్రాన్ని ఎమ్మెల్యే వాసుబాబు చేతుల మీదుగా కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల కర పత్రాన్ని కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు అందించి ఉత్సవాలకు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సంకు పుల్లయ్య సాదరంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, కమిటీ సభ్యులు తోపు సూర్యచంద్రరావు, అల్లుమోలు ప్రసాద్, పంజా రాంబాబు, వంకాల సుధాకర్, కోసూరి శ్రీను, కిలారి రవి, వెల్లంకి నరేష్, కాన్వెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ఉంగుటూరు: తల్లాపురం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్న గగ్గాల రామచంద్రరావును చేబ్రోలు ఎస్సై స్వామి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 21 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	36	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07–10
బెండకాయలు	24	కంద	40
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	38
కాకర కాయలు	24	కీరా దోస	40
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	20	అల్లం	120–240
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	35
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	26	చుక్కకూర	12
ఉల్లిపాయలు	32	తోటకూర	12
గోరుచిక్కుడు	34	గోంగూర	06
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	78
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40
		నిమ్మకాయలు (డజను)	--

విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత

ఏలూరు (టూటౌన్): యాదవ సంఘం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో చాటపర్రుకు చెందిన ఆవాల యశ్వంత్ అనే విద్యార్థికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. స్థానికత ఏటిగట్టులోని జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు గోళ్ళ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యాక్రమంలో ఆర్థిక సహాయం అందించారు. ఆవాల యశ్వంత్ పదోతరగతిలో 544 మార్కులు సాధించాడు. అతని కుటుంబ పరిస్థితి నేపథ్యంలో ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు చిదరబోయిన శ్రీనివాస్, ఏలూరు కార్పొరేషన్ డీఈఈ పిలగల కొండలరావు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు బుజ్జి, గొర్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపట్టనున్న దృష్ట్యా శుక్రవారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 11 కేవీ వీవీపీ ఫీడర్ పరిధిలోని సీఆర్ఆర్ కళాశాల ప్రాంతం, మెయిన్ రోడ్డు, పోలీస్ పెట్రోల్ బంక్ ప్రాంతం, టీటీడీ కల్యాణ మండపం రోడ్డు, కలెక్టర్ బంగ్లా ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఏలూరు రూరల్: చిత్రలేఖనం పోటీల్లో శనివారపుపేట జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని హెచ్ఎం జి.ప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సంస్కార్ భారతి సంస్థ వందే వేద భారతం అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించిందని వివరించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఆర్.యమున, ఎ.ప్రత్యూష టాప్‌టెన్‌లో చోటు దిక్కించుకున్నారని వెల్లడించారు. వీరికి ఈ నెల 8న నిర్వాహకులు సర్టిఫికెట్లతో పాటు అవార్డులు అందజేస్తారని వివరించారు.

ఎన్ఐఏ దాడులు అప్రజాస్వామికం

ఏలూరు (టూటౌన్): మీడియా సంస్థలు, న్యాయవాదుల మీద ఎన్ఐఏ సోదాలు, దాడులు అప్రజాస్వామిక మంటూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) జిల్లా కమిటీ గురువారం ఒక ప్రకటనలో ఖండించింది. ఏలూరులో ఐలు జిల్లా అధ్యక్షురాలు వి.శైలజ, ఏలూరు నగర కమిటీ అధ్యక్షులు పి.వెంకట్, కార్యదర్శి జి.విజయభాస్కర్‌లు ఈ మేరకు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఎన్ఐఏ పెట్టిన కేసుల్లో ముద్దాయిల తరుపున వాదిస్తున్న న్యాయవాదులు మీద, ఢిల్లీలో న్యూస్ క్లిక్ మీడియా ప్రతినిధుల మీద ఎన్ఐఏ సోదాల పేరుతో వేధించడం సరికాదని అభిప్రాయపడ్డారు. వెంటనే న్యాయవాదులపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థల సోదాల పేరుతో భయభ్రాంతులను గురి చేసే చర్యలను మానుకోవాలని వారు కోరారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ

ఏలూరు(మెట్రో): స్పెషల్ సమరీ రివిజన్–2024 లో భాగంగా డోర్–టు–డోర్ సర్వే పూర్తిచేసిన తర్వాత ఏలూరు నియోజకవర్గంలో 1,06,653 మంది పురుషులు, 116744 మంది మహిళలు, 41 మంది ఇతరులు వెరశి మొత్తము 2,23,438 మంది ఓటర్లు నమోదైనట్లు ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించి మార్పులు, చేర్పులు చేస్తున్నారన్నారు. స్పెషల్ సమరీ రివిజన్–2024లో భాగంగా ప్రతి బూత్ లెవెల్ అధికారి వారి పోలింగ్ కేంద్రానికి సంబంధించి ''డోర్–టు–డోర్'' వెళ్లి ఆయా ఓటర్ల వివరాలను పరిశీలించారని పేర్కొన్నారు.